E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :139 మంగళవారం 20 అక్టోబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## ఢిల్లీలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు!




ఎనిమిది మంది ముఠా సభ్యుల అరెస్ట్

రూ.3.71 కోట్ల అక్రమ నగదు ఫ్రీజ్

రూ.1.5 కోట్ల స్టాక్ స్వాధీనం

ఫరీదాబాద్ కేంద్రంగా డ్రగ్స్ దందా

విద్యార్థులు, యువతే ముఠా టార్గెట్

డ్రగ్స్ రవాణా వాహనాలు సీజ్

## ఎల్‌నినోపై సర్కార్ అలర్ట్!

ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్‌కమిటీ

భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు

ఐదుగురు మంత్రులకు సభ్యులుగా అవకాశం

సీఎం సలహాదారుకు ప్రత్యేక ఆహ్వానం

కరువు పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

శాఖలకు మార్గదర్శకాలు జారీ చేయనున్న కమిటీ

కేంద్రానికి నివేదికలు.. ప్రభుత్వానికి సిఫార్సులు




న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం): రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు మరియు సిఫార్సులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్?గా మరో మరో ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం సీఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతకక్, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను నియమించింది.

ప్రత్యేక ఆహ్వానితులుగా సీఎం సలహాదారు:

ముఖ్యమంత్రి సలహాదారు కే.రామకృష్ణారావు ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమన్వయం నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కేబినెట్ సబ్‌కమిటీ రాష్ట్రంలోని కరువు, ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. అలాగే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సిఫార్సులు అందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలను సమర్పించనుంది.

## పండుగ వేళ పోలీసు శాఖలో కుదుపు!

హైదరాబాద్‌లో 75 మంది ఎస్సైల బదిలీ

ఎస్సైల బదిలీలతో పోలీస్ శాఖలో కుదుపు

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సజ్జనార్

పలు విభాగాలకు ఎస్సైల మార్పు

లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్‌పై ఫోకస్

వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఆదేశం

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

2 లో

## తమిళనాడులో మరో కొత్త పార్టీ!

తమిళనాడులో కొత్త పార్టీకి అన్నామలై సిద్ధం

త్వరలోనే సొంత పార్టీ ప్రకటన

బీజేపీ అధ్యక్ష పదవికి గతంలో రాజీనామా

'వి ది లీడర్స్'తో సామాజిక ఉద్యమం

డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంపై ప్రత్యేక దృష్టి

పర్యావరణ పరిరక్షణకు విస్తృత కార్యక్రమాలు

స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల బరిలోకి

తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై ఆసక్తి




న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం): తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, 'కర్ణాటక సింఘం'గా పేరుగాంచిన కే. అన్నామలై రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను స్వయంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా పళనిలో జరిగిన ఒక కార్యక్రమంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుతూ.. త్వరలోనే సొంత పార్టీని ప్రారంభిస్తానని అధికారికంగా వెల్లడించారు.

రాజకీయాల్లోకి రాకముందు 2011 బ్యాచ్‌కు చెందిన కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన అన్నామలై, తన నిర్ణయాలు, నిజాయితీ కారణంగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## ఓటుకు రూ.4 వేలు ఇవ్వాలి: వైసీపీ నేత!

రాచమల్లు వ్యాఖ్యలతో ఏపీలో దుమారం

టీడీపీ రూ.2 వేలు.. వైసీపీ రూ.2 వేలు

ఏకగ్రీవాలతో నగదు అందడం లేదంటూ వ్యాఖ్యలు

ఇంట్లో నలుగురు ఓటర్లకు రూ.16 వేల ఆశ

ప్రజలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్

రాచమల్లుపై చర్యలకు కూటమి నేతల డిమాండ్

2 లో

## గాంధీ, నెహ్రూ నాయకత్వం వద్దు: ఒవైసీ!

ముస్లింలు ఎవరికీ బానిసలు కారు

మన సమాజం నుంచే నాయకులు రావాలి

ఇతర పార్టీల వెనుక నడవాల్సిన అవసరం లేదు

ముస్లింలను ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నారు

యువతకు రాజకీయ వేదిక కల్పించాలి

సొంత నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపు

ఒవైసీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

2 లో



## కాళేశ్వరం నీళ్లపై కదనభేరి

న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం): కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్‌ను తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రవహిస్తున్న గోదావరి నీటిని పరిశీలించిన ఆమె.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందించే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కరువు పరిస్థితుల్లోనూ నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

మిగతాది 2 లో..

- రైతులకు నీరివ్వకుంటే సహించేది లేదు!
- రేవంత్ సర్కారుకు కవిత స్ట్రాంగ్ వార్నింగ్
- కరువులోనూ గోదావరి నీరు..ఎందుకు ఎత్తిపోయరు?
- 93 మీటర్ల కాపర్ డ్యామ్ నిర్మించండి
- మేడిగడ్డతో పనిలేకుండా నీటిని లిఫ్ట్ చేయొచ్చు
- సాగునీటిపై నిర్లక్ష్యం.. రైతులకు అన్యాయం
- కాళేశ్వరంపై మరో రూ.50 వేల కోట్లు
- తుపాకులగూడెం నుంచే అనుసంధానం
- రైతుల కోసం పోరాటం ఆగదు..

## ఏపీ మున్సిపల్ బరిలో భారీ నామినేషన్లు!




న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికల సమయంలో కొన్ని ఘటనలు జరిగినా.. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,942 వార్డు స్థానాలకు 24,451 నామినేషన్లు అందాయి. మేయర్, చైర్‌పర్సన్ పదవులకు కలిపి 1,358 నామినేషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 18న నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తమ నామినేషన్లను సమర్పించారు. ఇక, చివరి రోజైన అక్టోబర్ 18న ఒక్కరోజే మేయర్, చైర్‌పర్సన్ పదవులకు 1,009 నామినేషన్లు దాఖలయ్యాయి.



దసరా పర్వదిన సందర్భంగా
నేడు మా కార్యాలయానికి సెలవు
కావున రేపటి సంచిక వెలువడదు
పునః దర్శనం తిరిగి గురువారం
(22-10-2026)
-ఎడిటర్

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం!

మదీనా క్రాస్‌రోడ్డులో చెలరేగిన మంటలు

బట్టల గోడౌన్‌లో ఒక్కసారిగా అగ్నికీలలు

దట్టమైన పొగలతో స్థానికుల్లో భయాందోళనలు

ఐదు ఫైరింజన్లతో మంటల అదుపునకు యత్నం

ఘటనతో రహదారిపై ట్రాఫిక్ అంతరాయం

ఆస్తి నష్టంపై అధికారుల ఆరా




న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం): దసరా పండుగ వేళ హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతమైన మదీనా క్రాస్‌రోడ్డు సమీపంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బట్టల దుకాణానికి చెందిన గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఏం జరుగుతుందో తెలియక పలువురు ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు.

మదీనా క్రాస్‌రోడ్డు పరిసరాల్లోని బట్టల గోడౌన్‌లో ఉదయం సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది.

## సీజేపీ నేతల కేసులో కొత్త మలుపు!




మెజిస్ట్రేట్‌కు హత్య బెదిరింపు మెసేజ్

సీజేపీ నేతల బెయిల్‌పై ఉత్కంఠ

బెదిరింపులపై ఢిల్లీ పోలీసుల దర్యాప్తు

బెయిల్ అడ్డుకునేందుకే కుట్ర: సీజేపీ

విచారణకు ఆలస్యం చేశారని ఆరోపణలు

సాయంత్రం వరకు కోర్టుకు రాలేదని విమర్శ

నాలుగు రోజుల తర్వాత ప్రాసిక్యూటర్ హాజరు

## ఏపీ మున్సిపల్ బరిలో భారీ నామినేషన్లు!

మొదటి పేజీ తరువాయి



అదే రోజు వార్డు సభ్యుల స్థానాలకు ఏకంగా 16,282 నామినేషన్లు అందాయి. దీంతో చివరి రోజు నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థుల సందడి నెలకొంది.

కార్పొరేషన్లలో మేయర్ పదవులకు 320 నామినేషన్లు దాఖలు కాగా, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చైర్‌పర్సన్ పదవులకు 1,038 నామినేషన్లు వచ్చాయి. వార్డు స్థానాల విషయానికి వస్తే, కార్పొరేషన్లలో 8,198 నామినేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 16,253 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక, మేయర్, చైర్‌పర్సన్ పదవులకు పార్టీలవారీగా వచ్చిన నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి 367, తెలుగుదేశం పార్టీ నుంచి 329, కాంగ్రెస్ నుంచి 117, జనసేన నుంచి 100 నామినేషన్లు అందాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 287, ఇతర పార్టీల నుంచి 158 నామినేషన్లు దాఖలయ్యాయి.

వార్డు సభ్యుల స్థానాలకు తెలుగుదేశం పార్టీ నుంచి అత్యధికంగా 9,460 నామినేషన్లు వచ్చినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నుంచి 8,175, జనసేన నుంచి 2,324, కాంగ్రెస్ నుంచి 416 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2,586, ఇతర పార్టీల నుంచి 1,490 నామినేషన్లు అందాయి. ఇదిలా ఉండగా, కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. కడప జిల్లా కలెక్టర్ నుంచి అందిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మైదుకూరు ఎన్నికలపై తదుపరి చర్యలు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా కొనసాగనున్నాయి.

## పండుగ వేళ పోలీసు శాఖలో కుదుపు!


GOVERNMENT OF TELANGANA
(POLICE DEPARTMENT)
Office of the Commissioner of Police Hyderabad City.
D.O.No. 13606/2026
No. HCP/ES/13/2026
Date:-18-10-2026.
ORDER
Sub:- Hyderabad City Police – Establishment – Transfers and postings of Sub-Inspectors of Police – Orders – Issued – Reg.
The following transfer and posting of the Sub-Inspectors of Police shown against their names are ordered on administrative grounds with immediate effect.
The concerned Officers are directed to relieve the above individuals immediately with instructions to report at their new place of postings and report compliance.
The Concerned Officers are requested to inform the date of relieving/reporting of the above individuals to this office for record.
Commissioner of Police, Hyderabad City.

**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దసర పండుగల వేళ పోలీసు శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అడ్మినిస్ట్రేటివ్ పనితీరును మరింత వేగవంతం చేయడంలో భాగంగా భారీగా సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 75 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.

నగరంలో శాంతిభద్రతల నిర్వహణను మరింత కట్టుదిట్టం చేసేందుకు, అలాగే సుదీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారిని వేర్వేరు స్టేషన్లు, విభాగాలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాలు, కంట్రోల్ రూమ్‌లకు బదిలీ చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. బదిలీ అయిన స్థానాల్లో అధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాబోయే పండుగలు, నగరంలో పెరుగుతున్న రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లుగా పోలీస్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఒకేసారి 75 మంది ఎస్సైలు బదిలీ కావడం పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## గాంధీ, నెహ్రూ నాయకత్వం వద్దు: ఒవైసీ!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దేశ రాజకీయాల్లో ముస్లింలు ఎవరికీ బానిసలు కాదని, సంప్రదాయ పార్టీల వెనుక నడవాల్సిన అవసరం లేదని ఆలిండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. తాజాగా ఉత్తర్ ప్రదేశ్‌లోని రాంపూర్ లో ఆయన మాట్లాడుతూ.. తమకు నెహ్రూ, గాంధీ , యాదవ్ కుటుంబాల నాయకత్వం ఇకపై అవసరం లేదని, తమ సమాజం నుంచి స్వయంగా నాయకులు ఎదుగుతారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంకెన్నాళ్లు ఇతర పార్టీల నాయకుల వెనుక తిరుగుతూ, వారిని నెహ్రూలు, గాంధీలుగా భావించి మద్దతు ఇవ్వాలని కొందరు మనవారే చెబుతున్నారని కామెంట్ చేశారు. 'అలాంటి వారికి, ఒవైసీకి తేడా ఇదే; వాళ్లు ఇతరులను సమర్థించమంటారు, కానీ నేను మాత్రం మీరే నాయకులు కండి అంటాను' అని అసదుద్దీన్ ఒవైసీ తేల్చిచెప్పారు.

ముస్లిం యువతీ యువకులకు ఇతర వర్గాలవారితో సమానంగా అపారమైన సామర్థ్యం, ప్రతిభ ఉందని, అయితే ప్రధాన రాజకీయ పార్టీలు వారిని కేవలం ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నాయే తప్ప సరైన వేదిక కల్పించడం లేదని అసదుద్దీన్ ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అణగారిన వర్గాల గొంతు వినిపించేందుకు, ముస్లిం యువతకు రాజకీయ వేదికను అందించేందుకే తమ పార్టీ నిరంతరం పనిచేస్తూనే ఉందని పేర్కొన్నారు. యువత ఎవరిపై ఆధారపడకుండా తమ సొంత నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అయితే, దేశంలోని ప్రధాన పార్టీల తీరును ఎండగడుతూ ఒవైసీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

## సీజేపీ నేతల కేసులో కొత్త మలుపు!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** కాక్రోచ్ జనతా పార్టీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌ల బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సమయంలో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కి హత్య బెదిరింపులు రావడం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. మెజిస్ట్రేట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు అపరిచిత వ్యక్తులపై నాన్-కాగ్నిజబుల్ రిపోర్ట్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కావాలనే ఆలస్యం చేస్తున్నారు: సీజేపీ తీవ్ర ఆరోపణలు

మెజిస్ట్రేట్‌కు వచ్చిన బెదిరింపుల నెపంతో విచారణను కావాలని పక్కదోవ పట్టించారని, తమ నేతలకు బెయిల్ రాకుండా నిరోధిస్తున్నారని సీజేపీ తీవ్రంగా మండిపడింది. ఈ పరిణామంపై సీజేపీ లీగల్ సెల్ చీఫ్ రత్నా సింగ్ స్పందిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము ఉదయం నుంచే కోర్టు వద్ద వేచి చూస్తున్నామని అన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు విచారణ జరుగుతుందని చెప్పారని పేర్కొన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియతో సహా అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయని.. కానీ మెజిస్ట్రేట్ సాయంత్రం 5 గంటల వరకు కోర్టు రూమ్‌లోకి రాలేదని ఆరోపించారు. బెయిల్ పిటిషన్ మెరిట్స్ ఆధారంగా విచారించకుండా, కేవలం ఆ బెదిరింపు మెసేజ్ చుట్టూనే చర్చను తిప్పారని రత్నా సింగ్ ఆరోపించారు. గత 4 రోజులుగా రాని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమవారం అకస్మాత్తుగా రావడం, వచ్చిన కొద్దిసేపటికే మెజిస్ట్రేట్ బెదిరింపుల అంశాన్ని తేవడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. తమ నేతల విడుదలను అడ్డుకోవడానికే ఇదంతా ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిందని ఆమె విమర్శించారు.

కాగా, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపారనే ఆరోపణలతో అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను ఢిల్లీ పోలీసులు గత వారం అరెస్ట్ చేసి, 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. వారి బెయిల్ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, విచారణ ప్రారంభమైన ఐదు నిమిషాలకే తనకు చంపేస్తామంటూ ఓ మెసేజ్ వచ్చిందని మెజిస్ట్రేట్ కోర్టులో స్వయంగా వెల్లడించడం హాట్ టాపిక్‌గా మారింది.

## ఢిల్లీలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దేశ రాజధాని ఢిల్లీలో నార్కోటిక్స్ డ్రగ్స్ సప్లై నెట్‌వర్క్‌పై సౌత్-ఈస్ట్ జిల్లా పోలీసులు భారీ మెరుపు దాడి నిర్వహించి అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టును రట్టు చేశారు. ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన ఎఫ్‌ఐఆర్ నం. 225/2026 కేసు దర్యాప్తులో పోలీసులకు సంచలన పురోగతి లభించింది. ఈ డ్రగ్స్ దందా ద్వారా అక్రమంగా ఆర్జించిన సుమారు రూ. 3,71,98,560 నగదు నిల్వలను చట్టపరమైన ఉత్తర్వుల ద్వారా ఢిల్లీ పోలీసులు విజయవంతంగా ఫ్రీజ్ చేయించారు. తొలుత స్థానిక పెడ్లర్లను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ నెట్‌వర్క్ వెనుక హర్యానాలోని ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న కీలక సరఫరాదారులు, భారీ స్టాకిస్టులు, మధ్యవర్తుల లింకులు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా ముఠా సభ్యుల నుంచి మార్కెట్లో సుమారు రూ. 1.5 కోట్ల విలువైన 1.383 కిలోల స్వచ్ఛమైన 'స్మాక్' మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో సమగ్ర దర్యాప్తు అనంతరం పోలీసులు మొత్తం ఎనిమిది మంది ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో కిరణ్ అలియాస్ రామ్ ప్రసాద్, నీరజ్ అలియాస్ థాపా, అశోక్ అలియాస్ రాము, మనియా అలియాస్ సుమన్ పాఠక్, విక్కీ, గుడ్డు, సునీత్ అలియాస్ నన్హే మరియు గోపీ సింగ్‌లుగా అధికారులు గుర్తించారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల వ్యాపారం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ రవాణాకు ఉపయోగించిన వాహనాలు, ఇతర సాంకేతిక పరికరాలను సీజ్ చేయడంతో పాటు, ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలున్న ఇతర కీలక సూత్రధారుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి.

## ఓటుకు రూ.4 వేలు ఇవ్వాలి: వైసీపీ నేత!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ స్థానిక ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయిస్తోందని, దీని వల్ల సామాన్య ప్రజలకు ఎన్నికల సమయంలో అందాల్సిన డబ్బులు దక్కకుండా పోతున్నాయని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రొద్దుటూరులో మీడియాతో మాట్లాడిన ఆయన.. సాధారణంగా ఎన్నికలు జరిగితే అధికార టీడీపీ రూ. 2 వేలు, తాము (వైసీపీ) రూ. 2 వేలు ఓటర్లకు పంచేవారమని నిస్సంకోచంగా వ్యాఖ్యానించారు. ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే పండుగ పూట కనీసం రూ. 16 వేల వరకు నగదు వస్తుందని సామాన్య ప్రజలు ఆశగా ఎదురుచూశారని, కానీ ఏకగ్రీవాల పేరుతో ఆ అవకాశాన్ని లేకుండా చేశారని చెప్పడం తీవ్ర దుమారం రేపుతోంది.

అలాగే ప్రజలకు చేరవలసిన ఆ డబ్బులను కూటమి ప్రభుత్వమే నేరుగా అందించాలని రాచమల్లు డిమాండ్ చేశారు. పోటీ లేకుండా ఏకగ్రీవాలు చేసుకున్నందుకు గాను, తామిచ్చే రూ. 2 వేలు, టీడీపీ ఇచ్చే రూ. 2 వేలు కలిపి మొత్తం రూ. 4 వేలను టీడీపీ నేతలే ప్రజల ఇళ్లకు వెళ్లి చెల్లించాలని చెప్పడం ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బుల పంపిణీని బాహాటంగా సమర్థిస్తూ, పరోక్షంగా ఓట్లకు నోట్ల సంస్కృతిని ప్రస్తావిస్తూ ఓ మాజీ ప్రజా ప్రతినిధి బహిరంగంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాచమల్లు చేసిన ఈ వ్యాఖ్యలపై అధికార కూటమి నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతూ, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేలా మాట్లాడినందుకు ఆయనపై ఎన్నికల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## కిలావుయా 55వ విస్ఫోటనం!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** అమెరికాలోని హవాయి ద్వీపంలోని క్రియాశీల అగ్నిపర్వత్వం కిలావుయా మరోసారి విస్ఫోటనం చెందింది. అక్టోబర్ 17న జరిగిన విస్ఫోటనంలో లావా ఫౌంటెన్లు ఎగిసిపడ్డాయి. సుమారు 700 అడుగుల ఎత్తు వరకు లావా ఎగిసిపడింది. 2024 డిసెంబర్ నుంచి గత 22 నెలల వ్యవధిలో ఇది 55వ సారి విస్ఫోటనం చెందడం.

హవాయిలోని వోల్కనోస్ నేషనల్ పార్క్‌లో ఉన్న కిలావుయా అగ్నిపర్వతం ఉత్తర బిలం వద్ద స్థానిక కాలమానం ప్రకారం.. తెల్లవారుజామున 3.19 గంటలకు లావా బయటకు రావడం ప్రారంభమైంది. ఉదయం 5 గంటల సమయానికి బయటకు రావడం తీవ్రమైంది. ఈ ప్రక్రియ సుమారు 6 గంటల పాటు కొనసాగి ఉదయం 9 గంటలకు ముగిసింది. అగ్నిపర్వతం పేలుడు ధాటికి ఎగిసిపడిన బూడిద మేఘం సుమారు 25,000 అడుగుల ఎత్తుకు చేరింది.

చివరిసారిగా దాదాపు 2 నెలల క్రితం మళ్లీ కిలావుయా విస్ఫోటనం చెందింది. చివరిసారిగా ఆగస్టు 25న ఇది జరిగింది. తాజా విస్ఫోటనం మొత్తం హాలేమా ఉమాఉ అగ్ని పర్వత బిలానికి మాత్రమే పరిమితం కావడంతో చుట్టుపక్కట ప్రాంతాలకు పెద్దగా ప్రమాదం జరగలేదు. కిలావుయా ప్రపంచంలో క్రియాశీలకంగా ఉన్న అగ్నిపర్వతాల్లోఒకటి.

## ఎల్‌నినోపై సర్కార్ అలర్ట్!




**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు మరియు సిఫార్సులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్ గా మరో మరో ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం సీఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతకక్, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను నియమించింది.

ప్రత్యేక ఆహ్వానితులుగా సీఎం సలహాదారు:

ముఖ్యమంత్రి సలహాదారు కే.రామకృష్ణారావు ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమన్వయం నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కేబినెట్ సబ్‌కమిటీ రాష్ట్రంలోని కరువు, ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. అలాగే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సిఫార్సులు అందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలను సమర్పించనుంది.

## తమిళనాడులో మరో కొత్త పార్టీ!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, 'కర్ణాటక సింఘం'గా పేరుగాంచిన కే. అన్నామలై రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను స్వయంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా పళనిలో జరిగిన ఒక కార్యక్రమంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుతూ.. త్వరలోనే సొంత పార్టీని ప్రారంభిస్తానని అధికారికంగా వెల్లడించారు. రాజకీయాల్లోకి రాకముందు 2011 బ్యాచ్‌కు చెందిన కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన అన్నామలై, తన నిర్ణయాలు, నిజాయితీ కారణంగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తన సర్వీస్‌కు రాజీనామా చేసిన అనంతరం ఆయన బీజేపీలో చేరి, తమిళనాడులో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. అయితే ఇటీవల పార్టీ పదవిని వీడిన ఆయన, ప్రస్తుతం ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'వి ది లీడర్స్' పేరుతో ఒక నూతన సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం ఈ ఉద్యమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జనహిత కార్యక్రమాలను ఆయన ముందుకు తీసుకువెళుతున్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక అంశాలపై ఆయన బృందం విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తోంది. అంతేకాకుండా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 'వి ది లీడర్స్' వేదిక తరఫున అభ్యర్థులను బరిలోకి దించి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

అన్నామలై తీసుకున్న ఈ సరికొత్త నిర్ణయం తమిళనాడు రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ద్రవిడ పార్టీల ఆధిపత్యం ఉండే తమిళ రాజకీయాల్లో ఒక మాజీ ఐపీఎస్ అధికారి, ప్రజా ఉద్యమాల ద్వారా సొంత పార్టీని స్థాపించి ముందుకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే కాలంలో ఆయన పార్టీ ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం!



**న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (తెలుగు గళం):** దసరా పండుగ వేళ హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతమైన మదీనా క్రాస్‌రోడ్డు సమీపంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బట్టల దుకాణానికి చెందిన గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఏం జరుగుతుందో తెలియక పలువురు ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు.

మదీనా క్రాస్‌రోడ్డు పరిసరాల్లోని బట్టల గోడౌన్‌లో ఉదయం సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. గోడౌన్‌లో పెద్ద మొత్తంలో దుస్తులు, ఇతర వస్తువులు ఉండటంతో మంటలు త్వరగా వ్యాపించి భారీగా ఎగసిపడ్డాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్ముకోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పండుగ సమయంలో వ్యాపార కార్యకలాపాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో అక్కడ కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది ఐదు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న వస్తువులు మంటలకు ఆహుతయ్యే అవకాశం ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఏంటన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

మరోవైపు, అగ్నిప్రమాదాన్ని చూసేందుకు స్థానికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి రావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలో ఎంత మేర ఆస్తి నష్టం జరగ్గా.. పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం జరిగిందా లేదా అన్న విషయంపై కూడా అధికారిక సమాచారం వెల్లడికావాల్సి ఉంది. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే నష్టంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## కాళేశ్వరం నీళ్లపై కదనభేరి

మొదటి పేజీ తరువాయి



కరువు కాలంలోనూ సుమారు 2 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని కవిత పేర్కొన్నారు. 93 మీటర్ల పొడవునా కాపర్ డ్యామ్ నిర్మిస్తే మేడిగడ్డ బ్యారేజీపై ఆధారపడకుండా నీటిని లిఫ్ట్ చేసే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే పరిశీలించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వానికి చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నానని, వెంటనే కాపర్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విజ్ఞప్తిని పట్టించుకోకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. రైతులకు విద్యుత్తు సరఫరా చేయకుండా, అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోసి సాగుకు వినియోగించకుండా నష్టం కలిగిస్తే సహించబోమని కవిత స్పష్టం చేశారు. రైతాంగ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సంపూర్ణ మేలు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పడిందని కవిత తెలిపారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై రూ.93 వేల కోట్లు ఖర్చు చేశారని, ఆయకట్టు లక్ష్యాన్ని పూర్తిగా సాధించేందుకు మరో రూ.50 వేల కోట్లు అవసరమవుతాయని ఆమె పేర్కొన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరు ప్రజలకు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. అయితే, ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు లక్ష్యాలు, అదనపు నిధుల అవసరంపై ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ నాయకురాలిగా ఆమె వెల్లడించిన వివరాలుగా పరిగణించాలి.

గోదావరి-కావేరి నదుల అనుసంధానంపైనా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అనుసంధానాన్ని పోలవరం నుంచి చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. విజయవాడలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తోనూ ఈ అంశంపై చర్చించినట్లు గుర్తుచేశారు. అయితే, తుపాకులగూడెం నుంచి గోదావరి-కావేరి అనుసంధానం చేపడితేనే తెలంగాణకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని కవిత అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం నీటి వినియోగం, కాపర్ డ్యామ్ నిర్మాణం, నదుల అనుసంధానంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆమె కోరారు.

# పోలీస్ అధికారినంటూ నకిలీ గుర్తింపు కార్డులతో హల్‌చల్.. యువకుడిపై కేసు నమోదు

## భద్రకాళి ఆలయంలో అనుమానాస్పదంగా సంచారం.. నకిలీ గుర్తింపు కార్డులు, ధ్రువపత్రం స్వాధీనం

**వరంగల్, అక్టోబర్ 19 (తెలుగు గళం న్యూస్)**

పోలీస్ అధికారినంటూ చెప్పుకుంటూ, నకిలీ గుర్తింపు కార్డులతో వరంగల్‌లోని భద్రకాళి ఆలయం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో భద్రకాళి ఆలయం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ఎం. కిరణ్, కానిస్టేబుల్ ఎం. భిక్షపతి.. నీలం రంగు టీషర్టుపై 'పోలీస్' గుర్తు కలిగిన దుస్తులు ధరించి, విశిష్ట అతిథుల దర్శన మార్గం వైపు వెళ్తున్న ఓ వ్యక్తిని గమనించారు. అతడిని ఆపి విచారించగా, తాను నిఘా విభాగంలో పనిచేస్తున్నట్లు చెప్పాడు. అతడి ప్రవర్తనపై అనుమానం రావడంతో తనిఖీ చేయగా, అతడి వద్ద రెండు జాతీయ నేర పరిశోధన బ్యూరో గుర్తింపు కార్డులు, వాహనంలో ఒక ధ్రువపత్రం లభించినట్లు పోలీసులు తెలిపారు. తాను 2019వ బ్యాచ్‌కు చెందినవాడినని, గత ఆరేళ్లుగా విధుల్లో ఉన్నానని చెప్పి నమ్మించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. నిందితుడిని వరంగల్‌లోని శివనగర్‌కు చెందిన బండి సుశాంత్ (24)గా గుర్తించారు. పోలీసు సిబ్బంది, ఆలయ అధికారుల సమక్షంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో నేర సంఖ్య 571/2026గా భారతీయ న్యాయ సంహితలోని 318(4), 205 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఉప పోలీసు పరిశీలకుడు ఎస్. శివకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

### అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి

ఎవరైనా వ్యక్తులు తమను తాము పోలీసు లేదా నిఘా విభాగం అధికారులుగా చెప్పుకుంటూ అనుమానాస్పదంగా ప్రవర్తించినా, ప్రైవేటు సంస్థల గుర్తింపు కార్డులతో ప్రభుత్వ అధికారులుగా చలామణి కావడానికి ప్రయత్నించినా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అటువంటి వ్యక్తుల గురించి వెంటనే స్థానిక పోలీసులకు లేదా అత్యవసర సహాయం కోసం 112 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.



# 'సే నో టు డ్రగ్స్' నినాదంతో దూసుకుపోతున్న వీసీఏ ప్రీమియర్ లీగ్!

- మూడు మ్యాచ్‌ల్లో విజేతలుగా మహాలక్ష్మి 11, సాయి చేయూత సోల్జర్స్, సూర్య కొంగాల కింగ్స్
- 16 బంతుల్లో 54 పరుగులతో మెరిసిన కుడుముల వంశీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

**తెలుగు గళం వెంకటాపురం(నూగూర్), అక్టోబర్ 19:**

దసరా మహోత్సవాల సందర్భంగా ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కాఫెడ్ మైదానంలో వెంకటాపురం క్రికెట్ అసోసియేషన్ (VCA) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటాపురం ప్రీమియర్ లీగ్ (VPL) సీజన్--3 తొమ్మిదో రోజు ఉత్సాహంగా కొనసాగింది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే లక్ష్యంతో 'సే నో టు డ్రగ్స్' నినాదంతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. తొలి మ్యాచ్‌లో మహాలక్ష్మి 11 జట్టు 112 పరుగులు చేయగా, దుర్గమ్మ 11 జట్టు 68 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో మహాలక్ష్మి 11 జట్టు 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో టీచర్స్ ఎ లెవెల్ జట్టు 117 పరుగులు చేయగా,



సాయి చేయూత సోల్జర్స్ జట్టు 8.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కుడుముల వంశీ కేవలం 16 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 54 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. మూడో మ్యాచ్‌లో మహాలక్ష్మి 11 జట్టు 41 పరుగులకే ఆలౌట్ కాగా, సూర్య కొంగాల కింగ్స్ జట్టు 5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకుంది. అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సాయి చేయూత సోల్జర్స్ ఆటగాడు కుడుముల వంశీకి టాస్ ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ పేర్ల కృష్ణబాబు చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేసి సత్కరించారు. క్రీడల ద్వారా యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు ప్రోత్సహించడమే ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశం.

# సికెఎం ఆసుపత్రిలో బాలింతలకు పడకల కష్టాలు!

- ఒకే బెడ్‌పై ఇద్దరు మహిళలు.. ప్రసవించిన తల్లులకూ తప్పని ఇబ్బందులు!
- సిబ్బంది, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని బాధితుల ఆవేదన

**తెలుగు గళం న్యూస్ హన్మకొండ అక్టోబర్ 19**

ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, ప్రసవం అనంతరం విశ్రాంతి తీసుకోవాల్సిన బాలింతలకు సరైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆసుపత్రి యాజమాన్యంపై ఉంది. అయితే కేఎం ఆసుపత్రిలో పడకల కొరతతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని కోరినా సంబంధిత సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

### ఒకే పడకపై ఇద్దరు మహిళలను పడుకోబెడుతున్నారనే ఆరోపణలు

ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన మహిళలకు సరిపడా పడకలు అందుబాటులో లేకపోవడంతో ఒకే పడకపై ఇద్దరు మహిళలు పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని బాధితులు చెబుతున్నారు. ప్రసవం అనంతరం తల్లి, నవజాత శిశువుకు ప్రత్యేక శ్రద్ధ, పరిశుభ్రమైన వాతావరణం, తగినంత విశ్రాంతి అవసరం. అలాంటి సమయంలో ఒకే పడకపై ఇద్దరు మహిళలను ఉంచడం వల్ల వారు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ప్రసవం జరిగిన మహిళలను సైతం ఒకే పడకపై ఇద్దరిని ఉంచుతున్నారని, దీనివల్ల వ్యక్తిగత పరిశుభ్రతకు ఆటంకం కలగడంతో పాటు తల్లులు, శిశువుల ఆరోగ్య భద్రతపై ఆందోళన నెలకొంటోందని బాధితులు పేర్కొంటున్నారు.



### ఇన్ఫెక్షన్లు సోకుతాయనే భయం

ప్రసవం అనంతరం మహిళల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో తగినంత పరిశుభ్రత పాటించకపోతే ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఒకే పడకపై ఇద్దరిని ఉంచడం, తగినంత దూరం లేకపోవడం, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు మహిళల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. ఆసుపత్రికి వైద్యం కోసం వస్తే కొత్త ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని మహిళలు భయపడుతున్నారని బాధితులు చెబుతున్నారు. అయితే ఈ పరిస్థితుల కారణంగా ఎవరికైనా ఇన్ఫెక్షన్లు సోకినట్లు నిర్ధారణ కాలేదు. అయినప్పటికీ, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఆసుపత్రి యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



### మొరపెట్టుకున్నా స్పందన లేదని ఆరోపణలు

పడకల కొరత, సౌకర్యాల లేమి గురించి పలుమార్లు సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రావడం లేదని బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాల్సిన సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, "మీ ఇష్టం ఉంటే ఉండండి.. లేదంటే వెళ్లిపోండి" అనే ధోరణిలో సమాధానాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చే మహిళలు ఇప్పటికే శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. అలాంటి సమయంలో వారితో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వైద్యం కోసం వచ్చిన వారిని నిర్లక్ష్యంగా చూడటం సరికాదని బాధితులు అభిప్రాయపడుతున్నారు.

### అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి

కేఎం ఆసుపత్రిలో బాలింతలు, గర్భిణులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్న సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని బాధితులు కోరుతున్నారు. ఆసుపత్రిలో పడకల సంఖ్యకు అనుగుణంగా రోగుల నిర్వహణ చేపట్టాలని, అవసరమైన అదనపు పడకలు ఏర్పాటు చేయాలని, ప్రసవం అనంతరం మహిళలకు తగిన విశ్రాంతి లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఆసుపత్రి గదుల్లో పరిశుభ్రతను కాపాడటం, ఇన్ఫెక్షన్ల నియంత్రణ చర్యలు అమలు చేయడం, రోగులకు తాగునీరు సహా అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించేలా పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. ప్రసూతి సేవలు అందించే ఆసుపత్రుల్లో మహిళల ఆరోగ్యం, గౌరవం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రసవం కోసం వచ్చిన మహిళలు పడకల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది? సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం ఎందుకు లభించడం లేదు? బాధితుల ఆరోపణలపై ఆసుపత్రి యాజమాన్యం స్పందించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# నూతన ఎస్సై రాజ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రిపోర్టర్లు

**పర్వతగిరి, అక్టోబర్ 19 (తెలుగు గళం న్యూస్)**




వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజ్‌కుమార్‌ను సోమవారం పర్వతగిరి రిపోర్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్‌కుమార్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్ర న్యూస్ రిపోర్టర్ గొల్లపల్లి మహేందర్, నిజం రిపోర్టర్ పోడేటి దయాకర్, మానేటి న్యూస్ రిపోర్టర్ జిల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక

- -లింగాల గ్రామపంచాయతీ పరిధిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు
- ఆడబిడ్డలను ప్రోత్సహిస్తూ... బతుకమ్మ విజేతలకు చీరలు అందజేసిన సర్పంచ్ మొగిలిపెల్లి రవీందర్



**తెలుగు గళం తాడ్వాయి అక్టోబర్ 19:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని లింగాల గ్రామపంచాయతీ పరిధిలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు, ఆడబిడ్డలను ప్రోత్సహించడంతో పాటు పండుగ విశిష్టతను భావితరాలకు చాటిచెప్పాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ సర్పంచ్ మొగిలిపెల్లి రవీందర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. లింగాల, బోటి లింగాల, కొడిశాల, వడ్డీగూడెం గ్రామాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ మొగిలిపెల్లి రవీందర్, పంచాయతీ కార్యదర్శి మోడం రాజేష్ కలిసి బతుకమ్మ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు చీరలను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలని వారు ఆకాంక్షించారు. మహిళలను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చాప సురేష్, కోరం రంజిత్ కుమార్, ఊకే ప్రకాష్, పూసం స్వరూప, మంకిడి నాగేశ్వరరావు, మంకిడి జగన్, పోలేబోయిన అనురాధతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# సామాజిక రుగ్మతలు గా వెట్టి చాకిరి, బానిసత్వం..



**నల్లగొండ (తెలుగు గళం):** వెట్టి చాకిరి, బానిసత్వం నిర్మూలన లో అందరూ కలసి కట్టుగా పనిచేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.. కార్మిక శాఖ ఆధ్వర్యంలో "అసంఘటిత రంగ కార్మికుల పై రూపొందించిన స్వేచ్ఛ రథాన్ని" కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరి, బానిసత్వం అనేది అనాదిగా వస్తున్న సామాజిక రుగ్మతలు అని వాటి నిర్మూలన లో భాగంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రచార రథాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనుందని అన్నారు. , ఈ ప్రచార రథాలు 20 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, సంతలు, గ్రామ చావడీలు ,జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో వెట్టిచాకిరి, బానిసత్వం నిర్మూలన పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. వెట్టిచాకిరిని నిర్మూలించే విషయమై కళాకారులు పాటలు, దృశ్య రూపకాలు, కరపత్రాలు, గోడపత్రికల రూపంలో అందరికీ విస్తృతంగా తెలియజేస్తారని తెలిపారు. వెట్టిచాకిరి పై ఎవరి కైనా సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 08069434343 కు సమాచారం అందించాలని కోరారు.. ఈ సందర్భంగ వెట్టి చాకిరి నిర్మూలనపై రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు...

# పెంచలకోనలో శరన్నవరాత్రి ఉత్సవాలు

**నెల్లూరు జిల్లా రాపూరు( తెలుగు గళం ):-** నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామివారి పట్టమహిషి ఆదిలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు అక్టోబర్ 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధాన్యలక్ష్మి రూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు పెంచలకోనకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో కోవూరు జనార్దన్ రెడ్డి ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.

# జనగామలో కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవం

## గీత కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

తెలుగు గళం న్యూస్ జనగామ అక్టోబర్ 19

జనగామ పట్టణంలోని మహంకాళి వీధి (గౌడవాడ)లో కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) 69వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25వ వార్డు కౌన్సిలర్ పాముకుంట్ల ప్రసాద్ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద గోపి, జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీత కార్మికులు, గౌడులు రాజకీయాలకు అతీతంగా కల్లుగీత కార్మిక సంఘం నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేడు గీత కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ ప్రయోజనాలు ఎన్నో పోరాటాల ఫలితమని పేర్కొన్నారు. కల్లుగీత ఉద్యమంలో ఎంతోమంది అమరవీరులు తమ జీవితాలను త్యాగం చేసి కార్మికుల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. వేలంపాటల రద్దు, మైఫూజ్ విధానం, నౌకరినామా రద్దు, సహకార సంఘాల ఏర్పాటు, తాటి, ఈత చెట్లపై గీత కార్మికులకు హక్కులు కల్పించడం వంటి అంశాల్లో సంఘం కీలకంగా పోరాడిందని తెలిపారు. అదేవిధంగా ఎక్స్‌గ్రేషియా, పింఛన్లు, తాటి చెట్ల పెంపకానికి భూమి వంటి సంక్షేమ సదుపాయాల సాధన కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహించిందన్నారు. గీత కార్మికులపై వివిధ ప్రభుత్వాలు భారాలు మోపిన సందర్భాల్లోనూ సంఘం కార్మికులను ఐక్యం చేసి పోరాటాల ద్వారా హక్కుల సాధనకు కృషి చేసిందని వివరించారు. గీత కార్మికుల వృత్తిని ఆధునీకీకరించడంతో పాటు వారి సంక్షేమం, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు రాజకీయాలకు అతీతంగా కార్మికులను సమీకరించి భవిష్యత్తులోనూ ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటాల్లో ప్రతి గీత కార్మికుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో జనగామ పట్టణ సహకార సంఘం కార్యదర్శి దూలం సత్తయ్య, సీనియర్ నాయకులు పాముకుంట్ల కృష్ణమూర్తి, పాముకుంట్ల మధు, రంగు రవికుమార్, రంగు వెంకటయ్య, చీకట్ల నవీన్, సురుగు మధు, రంగు శ్రీధర్, బత్తిని రోహిత్, సురుగు మహేష్, మట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అష్టభుజ రూపిని నమో నమః.

అమరావతి ,తెలుగు గళం సెప్టెంబర్ 19:




శరన్నవరాత్రు మహోత్సవాలలో ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ అష్టభుజాలతో మహిషాసుర మర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అసుర సంహారంలో మహిషుడు అనే రాక్షసుడుని దుర్గమ్మ సంహరించినట్లుగా పురాణంలో చెప్పబడి ఉన్న నేపద్యంలో మహిషాసుర మర్దిని దేవిగా అత్యంత విశేషమైన రోజుగా ఈరోజు చెప్పబడుతుంది.

భక్తులకు భయాన్ని పోగొట్టి అభయాన్నివసగే అయిగిరి నందిని అవతారంగా భక్తులు కొలుస్తూ ఉంటారు. ఈ రోజున

అయిగిరినందిని నందితమేదిని! విశ్వవినోదిని! నందిను గిరివర వింధ్య శిరోధినివాసిని ! విష్ణువిలాసిని! జిష్ణునుతే! భగవతి! హే శితికంఠకుటుంబిని! భూరికుటుంబిని భూరికృతే ! జయజయ! హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే !

అమ్మవారిని మూల మంత్రంతో స్మరించుకుంటూ లక్షలాదిమంది భక్తులు ఈ దర్శనం చేసుకున్నారు. అమ్మవారుసింహవాహినియై, దుష్టుడైన మహిషా సురుని సంహరించి ఋషుల, మానవుల కష్టాలను తొలగించినట్లుగా చరిత్రలో చెప్పబడి ఉంది. మహిషాసుర మర్దినీదేవి అలంకారములో ఉన్న శ్రీఅమ్మవారిని దర్శించడం వలన అరిష్టర్గాలునశిస్తాయి, తత్ఫలితంగా సాత్వికభావం ఉదయిస్తుంది. సర్వదోషాలు పటా పంచలు అవుతాయి. ధైర్య సాహసాలు సిద్ధిస్తాయని భక్తులు నమ్మకం.

# దసరా పండుగ అదునుగా అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలా?

**అయినవోలు రాజరాజేశ్వరి వైన్స్‌లో రాత్రి పది దాటినా విక్రయాలు!**
**నిబంధనలు బేఖాతరు చేస్తున్నారనే ఆరోపణలు.. ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నట్లు?**




తెలుగు గళం న్యూస్ హన్మకొండ/అయినవోలు అక్టోబర్ 19

దసరా పండుగను ఆసరాగా చేసుకుని అయినవోలులోని రాజరాజేశ్వరి వైన్స్‌లో మద్యం విక్రయాలు అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా రాత్రి పది గంటల తర్వాత మద్యం విక్రయాలు నిలిపివేయాల్సి ఉండగా, ఆ సమయం దాటినా అమ్మకాలు కొనసాగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. పండుగ వేళ మద్యం విక్రయాలు పెరిగే అవకాశాన్ని ఆసరాగా చేసుకుని నిబంధనలను పక్కనపెట్టి వ్యాపారం సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పండుగకు ముందే మద్యం విక్రయాలపై నియంత్రణ ఉండాల్సిన సమయంలో, నిర్ణీత సమయం దాటిన తర్వాత కూడా అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మద్యం దుకాణాలపై నిఘా పెట్టాల్సిన సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఈ వ్యవహారాన్ని ఎందుకు పరిశీలించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### పండుగ పేరుతో నిబంధనలకు తిలోదకాలా?

దసరా పండుగ సందర్భంగా మద్యం విక్రయాల సమయాలపై ప్రత్యేక నిఘా ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయినవోలు రాజరాజేశ్వరి వైన్స్‌లో రాత్రి పది గంటల తర్వాత విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పండుగ సందడిలో నిబంధనల ఉల్లంఘనలకు అవకాశం ఇవ్వకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనిఖీలు చేపడతారా? లేక మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి.

# 8వ ప్రపంచ తెలుగు మహాసభల “అంతర్జాల ప్రచార చిత్ర ముద్రిత ప్రతి” ఆవిష్కరణ






కొత్తపేట(తెలుగు గళం) అక్టోబర్ 19 : అంతర్జాతీయ ప్రమాణాల నిర్ధారణ సంస్థ” గుర్తింపు పొందిన తొలి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ ‘శ్రీశ్రీ కళా వేదిక’ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో నవంబర్ ఒకటవ తేదీ ఆదివారం ధవళేశ్వరం లోని ‘గౌతమీ సదన్’ (గౌతమీ సమావేశ మందిరం) లో నిర్వహించనున్న ఆ సంస్థ 177వ కార్యక్రమం, 8వ ప్రపంచ తెలుగు సాహిత్య మహోత్సవ సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కోనసీమ జిల్లా కొత్తపేట కళాసాహితి వ్యవస్థాపకులు గిడ్డి సుబ్బారావు నివాసమైన ‘కవితా విపంచి’ ప్రాంగణంలో శ్రీ శ్రీ కళావేదిక మహాసభల “అంతర్జాల ప్రచార చిత్రపు ముద్రిత ప్రతి” ఆవిష్కరణ జరిగింది.

తెలుగు భాష వెలుగును, ఉనికిని, వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేయాలనే సత్సంకల్పంతో అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను దేశంలోని పలు పట్టణాలలో మాత్రమే కాకుండా విదేశాలలో సైతం నిరంతరాయంగా నిర్వహిస్తూ తెలుగు ఔన్నత్యాన్ని, విశిష్టతలను ప్రపంచానికి బహుముఖంగా చాటుతున్న ‘శ్రీశ్రీ కళావేదిక’ నూతన అంతర్జాల ప్రచార చిత్రపు ముద్రిత ప్రతిని కొత్తపేట కవులు అత్యంత శ్రద్ధాసక్తులతో ఆనందోత్సాహాల నడుమ ఈరోజు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కళాసాహితి సంస్థ ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావుతో పాటు అధ్యక్షులు పెన్మెత్స హరిహర దేవళరాజు, క్రియాశీలక సభ్యుడు అద్దంకి బుద్ధ చంద్ర దేవ్, సభ్యులు గౌస్ మొహిద్దీన్, ఖాజా మొహిద్దీన్, వివివిఎస్సెస్ సుబ్బారావు, కోటిపల్లి రామకృష్ణ, పోలిశెట్టి మాచర రావు, సిద్ధంశెట్టి నారాయణ ప్రసాద్, వాసంశెట్టి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం “చెప్పాం... చేస్తున్నాం” పోస్టర్ ఆవిష్కరణ..!!

**టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు..**




తెలుగు గళం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 19: రాజంపేట.. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర సమాచారంతో కూడిన “చెప్పాం... చేస్తున్నాం” ప్రత్యేక పోస్టర్ ను నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమిపై ఉంచిన అపార నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపిస్తూ రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని చమర్తి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ అందుతున్నాయని చమర్తి జగన్ మోహన్ రాజు వివరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం 2.0 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. వీటికి తోడు పేదలకు గృహ నిర్మాణాలు, తాగునీరు, ఉచిత విద్యుత్ కనెక్షన్లు, గ్రామీణ, పట్టణ రహదారుల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు లాంటి మౌలిక వసతుల కల్పనలోనూ నియోజకవర్గంలో గణనీయమైన ప్రగతి సాధించామని వెల్లడించారు. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాలే కూటమి ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని చెబుతూ, పార్టీ శ్రేణులు, నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి “చెప్పాం... చేస్తున్నాం” పోస్టర్‌ను ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి ఇలాగే నిరంతరాయంగా కొనసాగాలంటే ప్రజల ఆశీస్సులు కూటమికి ఎల్లప్పుడూ ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను దృష్టిలో ఉంచుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని చమర్తి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# బ్లాక్ స్పాట్ల పరిశీలన.. ప్రమాదాల నివారణకు చర్యలు..



నల్లగొండ (తెలుగు గళం): యాదాద్రి భువనగిరి బీబీనగర్ నుంచి ఆలేరు వరకు జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ, జాతీయ రహదారుల సంస్థ, రోడ్డు భద్రతా కమిటీ సమన్వయంతో పనిచేసి, అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

# డ్రగ్స్ మాఫియాతో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి లింకులు

**- అతని అనుచరులు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే వనమాడి విజ్ఞప్తి**

కాకినాడ(తెలుగు గళం)అక్టోబర్ 19: గంజాయి డ్రగ్స్ మాఫియా వంటి వ్యవహారాలతో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి సంబంధాలు ఉన్నాయని అతని అనుచరులు జాగ్రత్తగా ఉండాలని అందులో మీకు సంబంధం లేకపోయినా మీరు ఇరుక్కుపోతారని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) విజ్ఞప్తి చేశారు. ద్వారంపూడికి 2021 నుంచే గంజాయి, డ్రగ్స్ మాఫియా వంటి వ్యాపారాలు సాగుతున్నాయని అతను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో సుమారు నెలరోజుల పాటు ఎక్కడికి వెళ్ళిపోయారో ఎవరికి చెప్పలేదని అన్నారు. తాము వివిధ కోణాల్లో విచారించగా ఆఫ్రికా ఖండంలోని ఐవరీ కోస్టులో డ్రగ్స్ వ్యాపారాలు సాగిస్తున్నాడని విషయాన్ని నాడు చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. సోమవారం కాకినాడలోని టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించి ద్వారంపూడి మాఫియాతో ఉన్న సంబంధాలను ఎమ్మెల్యే వనమాడి తెలియజేశారు. ద్వారంపూడి అతి ముఖ్య అనుచరుడు వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ డ్రగ్స్ తరలిస్తుండగా కేరళలోని విమానాశ్రయంలో పట్టుకున్నారని చెప్పారు. ద్వారంపూడి ఐవరీ కోస్టులో డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నాడని తాము ప్రతిపక్షం ఉండగా చెప్పామన్నారు. అప్పుడు ద్వారంపూడి అనుచరులు కాకినాడలో ఉన్న టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు. ద్వారంపూడి డ్రగ్స్, గంజాయి కూడా వ్యాపారాలు చేసి కాకినాడ నగర, పరిసరాల్లో ఉన్న యువత వినాశనానికి కారణమయ్యారన్నారు. గంజాయిని డంపింగ్ యార్డ్లో ఉంచి సరఫరా చేశారని చెప్పారు. టీడీపీ హయాంలో కాకినాడను గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను అరికట్టి స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తే తర్వాత అధికారం కోల్పోవడంతో ఆ అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామన్నారు. ఆ పనులు ద్వారంపూడి పూర్తి చేయకపోగా డ్రగ్స్ వ్యాపారం పైనే అధిక దృష్టి సారించేవారని కొండబాబు చెప్పారు. ద్వారంపూడి అనుచరులు , అతనికి ఓట్లు వేసిన ప్రజలు విజ్ఞతతో ఆలోచించి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కొండబాబు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాకినాడ సిటీ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, కాకినాడ సిటీ టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# భారత్--న్యూజిలాండ్ ఒప్పందంతో తెలంగాణకు లాభం




నల్లగొండ (తెలుగు గళం): భారత్--న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో తెలంగాణ ఔషధ, వస్త్ర పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని డీజీఎఫ్‌టీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు నుంచి న్యూజిలాండ్‌కు వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల తొలి ఎగుమతులను సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఒప్పందంతో ఎగుమతులు పెరిగి, యువతకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.